www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 17 సెప్టెంబర్ 2023




## విజిలెన్స్ ఫుడ్ కమిటీ సభ్యునిగా సత్యనారాయణ

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ఏలూరు జిల్లా విజిలెన్స్ ఫుడ్ కమిటీ సభ్యునిగా మండలంలోని కైకరం గ్రామానికి చెందిన కోనే వీరవెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. సత్యనారాయణ రెండు దశాబ్దాలపాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం దివ్యాంగ్ మహా సంఘటన్ రాష్ట్ర అధికారి ప్రతినిధిగా, నేషనల్ ట్రస్ట్ ఆక్ట్ లోకల్ కమిటీ మెంబర్‌గా, మానవత మండల సహాయ కార్యదర్శిగా, ఫిజికల్లీ ఛాలెంజ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బాధ్యతల్లో ఉన్నారు. సత్యనారాయణ నియామకంపై ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనకిచ్చిన పదవిలో తన శక్తి మేర పని చేస్తానన్నారు.

# రాజకీయం రసవత్తరం..!

- టిడిపి, జనసేన పొత్తు ప్రకటనతో హాట్‌టాపిక్‌గా జిల్లా రాజకీయం
- సీట్ల కేటాయింపుపై టిడిపితో వైసిపి మైండ్‌గేమ్
- టిడిపి, జనసేన కేడర్‌లోనూ సీట్ల పంపకాలపై తర్జనభర్జనలు
- భీమవరంలో పవన్‌కల్యాణ్ పోటీ, మెజార్టీపైనా ఇప్పటి నుంచే చర్చలు

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఎన్నికల పొత్తులపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనతో జిల్లా రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. పొత్తుపై టిడిపి, జనసేన కేడర్‌లో సుముఖత వ్యక్తమవుతున్నప్పటికీ సీట్ల కేటాయింపుపై మాత్రం తీవ్ర చర్చ సాగుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని టిడిపిని టార్గెట్ చేస్తూ వైసిపి మైండ్‌గేమ్ ప్రారంభించిందనే చర్చ నడుస్తోంది. ఫలానా నియోజకవర్గంలో సదరు నాయకుడికి టిక్కెట్ పోయినట్లే అంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూ మైండ్‌గేమ్ ఆడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గత ఎన్నికల సమయంలో సదరు నాయకులకు వ్యతిరేకంగా పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగులను సేకరించి తాజా వార్తలుగా ప్రచారం చేస్తుండటం ఇరుపార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. టిడిపి, జనసేన కేడర్‌లో చీలిక తెచ్చేందుకు వైసిపి ప్రయత్నిస్తుందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైసిపి మైండ్ గేమ్‌కు ప్రధాన కారణం ఒక్కటేననే చర్చ నడుస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన గతంకంటే బలం పుంజుకుంది. కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేన పలు నియోజకవర్గాల్లో ప్రభావం చూపే పరిస్థితి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. పొత్తులో భాగంగా జనసేనకు ఐదు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం తీసుకునే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నరసాపురం ఎంపీ స్థానంలో జనసేన అభ్యర్థి పోటీకి దిగే అవకాశం ఉందని లెక్కలు కడుతున్నారు. ఇక అసెంబ్లీ సీట్లకు వచ్చేసరికి నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఏలూరు స్థానాలను అడిగే అవకాశం ఉందని చెబుతున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం సీట్లలో టిడిపికి ఇబ్బంది లేకపోయినప్పటికీ ఉంగుటూరు, ఏలూరు స్థానాల విషయంలో కొంత ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఆయన ప్రస్తుతం టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. దీంతో ఉంగుటూరు సీటు జనసేనకు ఇచ్చేసినట్లేనని, గన్నికి సీటు లేదంటూ వైసిపి ఇప్పటి నుంచే మైండ్‌గేమ్ ఆడుతుందనే చర్చ నడుస్తోంది. ఏలూరు స్థానం రెడ్డి అప్పలనాయుడుకా.. బడేటి చంటికా అంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న పరిస్థితి నెలకొంది. సీట్ల కేటాయింపు అనేది అధినాయకుల నిర్ణయాలను బట్టి ఉంటుందని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. అయితే ఇప్పటి నుంచే వైసిపి సీట్ల కేటాయింపుపై మైండ్‌గేమ్ ప్రారంభించి టిడిపి, జనసేన కేడర్‌ను గందరగోళపరుస్తోందని ఇరుపార్టీల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో జనసేన బలం టిడిపికి తోడైతే అత్యధిక స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో వైసిపి ఇలాంటి మైండ్‌గేమ్ ప్రారంభించిందని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు.

### పవన్‌కల్యాణ్ పోటీ, మెజార్టీపైనా చర్చ..

టిడిపి, జనసేన పొత్తు ఖరారు కావడంతో భీమవరంలో పవన్‌కల్యాణ్ పోటీపై తీవ్రమైన చర్చ సాగుతోంది. గతంలో టిడిపి, జనసేన విడివిడిగా పోటీచేయడం కారణంగానే పవన్‌కల్యాణ్ ఓడిపోయారని, ఈసారి అటువంటి పరిస్థితి ఉండదని లెక్కలు వేస్తున్నారు. పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీచేయడం ఖాయమన్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అదే తరుణంలో గత ఎన్నికల్లో ఏయే పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయనే లెక్కలు తీస్తూ పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ వచ్చే అవకాశం ఉందనే అంశంపై బెట్టింగ్‌లు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్ జిల్లాలో పోటీ చేస్తేనే ప్రయోజనం ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లోనూ రాజకీయం వేడెక్కింది. ఇప్పుడే ఎన్నికలు వచ్చేస్తున్నాయా అన్నట్లు జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

## వైఎస్ఆర్ కాపునేస్తం కింద రూ.29.81 కోట్లు

### 19,869 మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలకు లబ్ధి

### జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

**ప్రజాశక్తి - ఏలూరు**

ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 19,869 మంది మహిళా లబ్ధిదారులకు వైఎస్ఆర్ కాపునేస్తం ఆర్థిక సహాయాన్ని విడుదల చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో రాష్ట్రస్థాయిలో వైఎస్ఆర్ కాపునేస్తం పథకం ఆర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, రుక్మిణీదేవితోపాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. జిల్లాకు జమ చేసిన రూ.29.81 కోట్లు మొత్తానికి నమూనా చెక్కును కాపునేస్తం కింద లబ్ధిదారులకు జెసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ కాపునేస్తం కింద జిల్లాలో నాలుగో విడత 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను 19,869 మందికి రూ.29.81 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కాపునేస్తం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలకు సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున ఐదు సంవత్సరాలకు రూ.75 వేలు వారి ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో చింతలపూడి నియోజ కవర్గంలో 3456 మంది లబ్ధిదారులకు రూ.5.18 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో 1769 మందికి రూ.2.65 కోట్లు, ఏలూరు నియోజకవర్గంలో 1810 మందికి రూ.2.72 కోట్లు, కైకలూరు నియోజకవర్గంలో 2992 మందికి రూ.4.49 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలో 2308 మందికి రూ.3.46 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో 3692 మందికి రూ.5.54 కోట్లు, ఉంగుటూరు నియోజకవర్గంలో 3216 మందికి రూ.4.8 కోట్లు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 626 మంది లబ్ధిదారులకు రూ.93.90 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

## సంక్షేమ పథకాల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శం

### ఎంఎల్ఎ వాసుబాబు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసుబాబు

సంక్షేమ పథకాల అమల్లో మన రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా ముఖ్యమంత్రి జగన్ తీర్చిదిద్దారని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక కమ్మ కల్యాణ మండపంలో కొత్తగా మంజూరైన 613 మందికి పింఛన్ల పంపిణీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 27 గ్రామాలవారీగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ పాపారావు బాబ్జి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి రక్తదాన శిబిరాలు

**ప్రజాశక్తి - ఏలూరు**

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆయుష్మాన్ భవ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకూ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జి.రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖలో భాగమైన జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా విభాగం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు బ్లడ్ బ్యాంకుల ద్వారా 'సేవా ఫక్వాడ'లో భాగంగా ఉమ్మడి జిల్లా అంతటా వివిధ ప్రాంతాలలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ పక్షోత్సవాల్లో ఈ నెల 17, 24, అక్టోబరు 1, 2 తేదీల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగిలిన రోజుల్లో సాధారణ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెంల్లో ఉన్న ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలతోపాటు ఏలూరు, తణుకు, నర్సాపురంల్లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రాలు, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, జంగారెడ్డిగూడెంలోని గుడ్ సమారిటన్, నార్ని రత్నాలయ, బుద్ధరాజు ఆనందరాజు, ధరణి, ఎఎస్ఎన్ రాజు, పాలకొల్లు వాలంటరీ వంటి ప్రయివేటు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రాలు కూడా పాల్గొంటాయని తెలిపారు. రక్తదాతలు జిల్లాలోని వివిధ రక్తనిధి కేంద్రాల ద్వారా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కుక్కునూరు-దాచారం మధ్య గుండేటివాగు కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు

## నిలకడగా వరద గోదావరి

### ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

### రెండు రోజులుగా 12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

**ప్రజాశక్తి - కుక్కునూరు**

రెండు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద శనివారం నిలకడగా ఉంది. ఇప్పటికే పెరిగిన వరదతో ముంపులోనే ఉన్న కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే రెండో రోజూ అదే పరిస్థితి కొనసాగింది. దీంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, వ్యాపారులు, ప్రధానంగా మండల కేంద్రంలో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ 15 కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరాల్సిన పరిస్థితి ఉంది. శనివారం ఉదయం భద్రాచలంలో 32 అడుగులు ఉన్న గోదావరి సాయంత్రానికి ఒక అడుగు తగ్గి నిలకడగా ఉంది. అయితే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు బృందాలు

**ప్రజాశక్తి - భీమడోలు**

ప్రతి ఒక్కరికీ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష నమోదు కార్యక్రమం మండలంలో ప్రారంభమైందని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి తెలిపారు. వైద్యసేవలు అందించేందుకు మండల పరిధిలోని 15 ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాల నిర్వహణకు మండలస్థాయి అధికారుల నేతృత్వంలో పని చేసే రెండు బృందాలను నియమించినట్లు తెలిపారు. దీనిలో ఒకటి ఎంపిడిఒ నేతృత్వాన, మరొకటి తహశీల్దార్ నేతృత్వంలో పని చేస్తుందని చెప్పారు.

## వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుకుమార్

**ప్రజాశక్తి - ముసునూరు**

ఏలూరు జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముసునూరు మండలం వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయులు బి.సుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుకుమార్‌ను పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పి.రవీంద్ర, తాత నాగేశ్వరరావు, ఎన్.శివనాగేంద్రరావు, కె.రాజేంద్రప్రసాద్ అభినందించారు.

## కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

**ప్రజాశక్తి - చాట్రాయి**

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యాన మండలంలోని చీపురుగూడెంలో చింతలపూడి ఎత్తిపోతలకు సంబంధించిన అక్విడెక్టు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు మరిడి మాట్లాడారు. తొలుత గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బొట్టు రామచంద్రరావు, చీకటి చెన్నారావు, మంచిన పూర్ణ, మందలపు జగదీష్, ఘంటసాల మన్మథరావు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముసునూరు:** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పోస్ట్ కార్డు ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని టిడిపి కోఆర్డినేటర్ మందలపు రవి అన్నారు. ముసునూరులో తెలుగు మహిళలు, టిడిపి శ్రేణులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మందలపు రవి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నేతలు గద్దె రఘుబాబు, మందలపు ధర్మరాజు, కొలి గంగారామ్, పి.గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కైకలూరు:** వైసిపి పాలనకు రోజులు దగ్గర పడ్డాయని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. శనివారం ఆటపాకలోని టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, మాజీ జడ్‌పిటిసి సభ్యురాలు విజయలక్ష్మి, మాజీ ఎఎంసి ఛైర్మన్ తాడినాడ బాబు, బలే ఏసురాజు, నేతలు పాల్గొన్నారు.

**టి.నరసాపురం:** చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టినరిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావుగౌడ్, వెలగపాడు సర్పంచి నయనారపు జలపాలు, ఆచంట సూర్యనారాయణ, శీలం సాయి వినయ్ పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం :** టిడిపి దీక్షలు కొనసాగాయి. రావూరి కృష్ణ అధ్యక్షతన చేపట్టిన దీక్షల్లో టిఎన్ఎస్ఎఫ్ నుంచి పలువురు దీక్షల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నేతలు మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, పరిమి సత్తిపండు, ఆకుల రాకేష్, దెందులూరి రాజీ, తూటికుంట రాము, రాజాన సత్యనారాయణ, దాసరి శ్యాంసుందర్ శేషు, సాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ, నిర్వాహకులు

## 21న 'దేశమును ప్రేమించుమన్నా' సామూహిక గీతాలాపన

**ప్రజాశక్తి - ఏలూరు**

మహాకవి గురజాడ 161వ జయంతి సందర్భంగా ఈ నెల 21న ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులచే సామూహికంగా 'దేశమును ప్రేమించుమన్నా' గీతాలాపన, అనంతరం ప్రదర్శన జయప్రదం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కోరారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన గురజాడ అప్పారావు 161వ జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాబ్జీ మాట్లాడారు. ఆనాటి సమాజాన్ని గురజాడ అప్పారావు ఉన్నదున్నట్లుగా చూశారని, చూసింది చూసినట్లు చెప్పారని అన్నారు. అసలు దేశమంటే ఏమిటీ ప్రశ్న వేసుకుని 'దేశమంటే మట్టి కాదు.. దేశమంటే మనుషులు' అని ఏమాత్రం తడబడకుండా 'తిండి కలిగితే కండకలదోయ్.. కండకలవాడేను మనిషోయ్' అని ఒక జీవశాస్త్రవేత్త చెప్పినట్లు చెప్పాడని గుర్తు చేశారు. జనం కూడు, గుడ్డకు నోచుకోకుండా ఎన్ని స్వాతంత్రాలు వచ్చినా ఏం లాభమని, అందుకే దేశమే గతి బాగుపడునోయ్ అని అన్నారన్నారు. 'మతములన్నియు మాసిపోవును.. జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అని భవిష్యత్తు ప్రపంచం విజ్ఞానానిదే అని ఢంకా భజాయించి గురజాడ చెప్పారన్నారు. ఆయన అడుగుజాడల్లో అంతా నడవాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎం.సుజయ్‌కృష్ణ మాట్లాడుతూ 21న ఉదయం అన్ని విద్యాలయాల్లో గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని సామూహికంగా ఆలపించాలని కోరుతున్నామన్నారు. కమిటీ గౌరవ సలహాదారులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, సెట్‌వెల్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, మానవత, మాతృదేవోభవ సేవా ట్రస్ట్, ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్, వివిధ లయన్స్ క్లబ్‌ల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. జిల్లా విద్యాశాఖ తరపున కూడా ఈ కార్యక్రమాన్ని బలపరుస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 21న ఉదయం 9.30 గంటలకు ఇండోర్ స్టేడియం వద్దకు విద్యార్థులు, దేశభక్తి భావాలు కలిగిన వారు చేరుకోవాలని, అక్కడ 'దేశమును ప్రేమించుమన్నా' గేయం సామూహిక ఆలాపన అనంతరం ప్రదర్శన, ఫైర్‌స్టేషన్ వద్ద మానవహారం నిర్వహించి తిరిగి ప్రదర్శన ఇండోర్ స్టేడియంకు చేరుతుందని వివరించారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, డిఇఒ పి.శ్యామ్‌సుందర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహర్‌రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, సిఆర్ రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఏలూరు నగర ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ గురజాడ 161వ జయంతి సందర్భంగా ఆయన చూపిన ఆదర్శ భావాలు విద్యార్థులకు తెలిపే కార్యక్రమానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రయివేటు స్కూల్స్ అన్నీ భాగస్వాములవుతాయని తెలిపారు. 21వ తేదీ కార్యక్రమానికి సంబంధించి కరపత్రం, వాల్‌పోస్టర్‌ను సాబ్జీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు, విజిఎంవిఆర్.కృష్ణారావు, కూచిపూడి సత్యనారాయణ, కెసిహెచ్.చంద్రశేఖర్, వి.సురేష్, మేతర అజయ్‌బాబు, ఎస్.కస్తూరిరావు, జి.శారద, వి.ఠాగూర్‌రాజా, డి.గణేష్, ఎం.ఇస్సాక్, కె.సోమ్లానాయక్ పాల్గొన్నారు.

# నిరసనలు.. నిర్బంధాలు..!

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ శ్రేణులు వివిధ రూపాల్లో నిరసనలు తెలపడం ప్రారంభించాయి. లోకేష్ యువగళం యాత్రలో భీమవరం శివారు తాడేరు వంతెన వద్ద వైసిపి, టిడిపి ఘర్షణతోనే జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత మూడు రోజులు లోకేష్ యాత్ర సాఫీగా సాగి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే నంద్యాలలో చంద్రబాబు అరెస్టుతో జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు రోడ్లపైకొచ్చి ఆందోళనలు ప్రారంభించారు. చంద్రబాబు కోర్టు మెట్లు ఎక్కాక కచ్చితంగా బెయిల్ వస్తుందని సంబరాలకు సిద్ధమయ్యారు. అయితే కోర్టు చంద్రబాబుకు రిమాండ్ విధించడం, హుటాహుటీన రాత్రి సమయంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడం గంటల వ్యవధిలో జరిగిపోయింది. దీంతో కంగుతిన్న టిడిపి నేతలు సైతం మరుసటి రోజు బంద్ నిర్వహణకు రంగంలోకి దిగలేకపోయారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్బంధం. బంద్ నాటి నుంచి నేటి వరకూ రెండు జిల్లాల్లో టిడిపి ఆందోళనలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గృహ నిర్బంధాలు వంటి వాటితోపాటు నేరుగా నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెడతామని హెచ్చరించే స్థాయికి పోలీసులు అధికారులు వెళ్లారంటే అతిశయోక్తి కాదు. ప్రజాస్వామ్యంలో నిరసనలకే చోటులేదన్నట్లు కార్యాలయాలు, ఇళ్ల వద్దే నిరాహార దీక్షలు చేపట్టాలి తప్ప ప్రధాన కూడళ్లు, కార్యాలయాల వద్ద చేపట్టొద్దంటూ హుకుం జారీ చేశారు. దీంతో మరోసారి టిడిపి నేతలు కంగుతిన్నారు. ఇక గత్యంతరం లేక కార్యాలయాల వద్దే దీక్షలు ప్రారంభించారు. ఆపై ప్రార్థనా మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయడం ప్రారంభించారు. సామాన్య ప్రజానీకంలో చంద్రబాబు అరెస్టు నుంచి టిడిపి నిరసనల వరకూ అన్నీ చర్చనీయాంశమయ్యాయి. అదే సమయంలో జనసేనాని పవన్ కళ్యాణ్ పొత్తు ప్రకటనతో టిడిపి శ్రేణులు తమకు ఒక అండ దొరికిందన్నట్లు ఊరట పొందాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అయితే పోలీసులు శాంతియుతంగా నిర్వహిస్తున్న పాదయాత్రలను సైతం అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. ఏలూరు జిల్లా లో ద్వారకాతిరుమల మండలంలో టిడిపి పాదయాత్రను పోలీసులు అడ్డుకున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. యాత్రను అడ్డుకునే ప్రయత్నం కాకుండా లాఠీలు ఝుళిపించడానికే ఉత్సాహం చూపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పోలీసుల వైఖరిపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్న దుకాణదారులను పోలీసులు బెదిరించి షాపులు తెరిపించే ప్రయత్నం చేశారని, ఇదెక్కడి దారుణమంటూ సిఐను నిలదీశారు. పట్టణంలో యాత్రగా ముందుకెళ్తున్న ఎంఎల్ఎను అడ్డుకోవడం మరింత వివాదాస్పదమైంది. అధికారపక్ష వ్యతిరేకులు ఎవరైనా రోడ్డెక్కితే నిర్బంధించడమే పోలీసుల పనిగా మారిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. లోకేష్ యాత్రలో తాడేరు వంతెన వద్ద ప్రదర్శించిన నిర్లిప్త వైఖరితో పోలీసు శాఖ అపఖ్యాతి మూటగట్టుకుంది. ఇదే తీరు కొనసాగితే వైసిపి, టిడిపి శ్రేణుల నడుమ వైరం టిడిపి వర్సెస్ పోలీసు శాఖ అన్నట్లుగా తయారయ్యే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

**ప్రజా ఉద్యమాలపైనా అదే నిర్బంధం**

అగ్రిగోల్డ్ బాధితులు తమకు ఇచ్చిన హామీలు అమలు చేసి న్యాయం చేయాలని కోరుతూ చలో విజయవాడకు పిలుపునిస్తే జిల్లాలో సంబంధిత ప్రతినిధులను గృహ నిర్బంధం చేశారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధం టిడిపి ప్రభుత్వ నిర్బంధాన్ని మించిపోయిందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. గరగపర్రు ఉద్యమం, ఆక్వా ఫుడ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం, ఎర్రకాల్వ మిగులు భూములపై పోరు చేస్తున్న పేదలపై అక్రమ నిర్బంధం, ఏజెన్సీలో భూపోరాటంపై ఉక్కుపాదం, భూస్వాములకు వత్తాసు పలకడం, శ్రీనివాసపురంలో దళిత పాలేరు హత్య ఘటన సందర్భంగా ఆ గ్రామానికి ఎవరినీ వెళ్లనీయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలన్నీ టిడిపి ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్నాయి. ఫలితంగానే గత ఎన్నికల్లో జిల్లా ప్రజలు టిడిపికి గట్టి షాక్ ఇచ్చారు. ఆ ఉద్యమాలు, ఆందోళనలను అడ్డు పెట్టుకుని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం వాటన్నింటినీ గాలికొదిలేసి టిడిపిని మించి నిర్బంధం విధించడం కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికార పక్షం ఇచ్చిన హామీలు అమలు చేసి చట్టబద్ధంగా వ్యవహరించడంతోపాటు పోలీసు అధికారులు సైతం చట్టానికి లోబడి ప్రభుత్వ సేవకులుగా కాక ప్రజా రక్షకులుగా ఉండాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

**- వివిఎస్‌వి.ప్రసాద్**

## 'విధుల్లోకి తీసుకోవాలి'

**కొయ్యలగూడెం:** ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుని, ఇవ్వాల్సిన జీతం చెల్లించాలని కోరుతూ జార్జ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ కన్నాపురం కార్యాలయంలో ఉద్యోగులు 15 రోజుల నుంచి నిరాహారా దీక్షలు చేస్తున్నారు. మండలంలోని కన్నాపురం, బుట్టాయగూడెం కేంద్రంగా జార్జ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థ ముఖ్య లక్ష్యం మానసిక రోగులుగా ఉన్న వారిని గుర్తించి వైద్య సదుపాయాలు కల్పించడం. ఈ నేపథ్యంలో సంస్థలో పని చేయుటకు ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో ఒక సంవత్సర కాలంకి నియమించుకుంది. పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి నుంచి గిరిజనులను కన్సల్టెంట్‌గా జార్జ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ తీసుకుంది. ఆ మండలంలో ఉన్న గ్రామాలలో మానసిక రోగులను గుర్తించి సంస్థకు తెలపాలి. పని తీరు సరిగ్గా లేదనే నెపంతో ఉద్యోగులను తొలగించి, రావాల్సిన జీతం కూడా ఆపేశారు. దీంతో న్యాయం కోసం ఉద్యోగులు జార్జ్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ కన్నాపురం సంస్థ కేంద్ర కార్యాలయంలో 15 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నారు. తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని, జీతం చెల్లించాలని కోరుతున్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి

**ఏలూరు అర్బన్:** సెప్టెంబరు 25, 26, 27వ తేదీలలో బాపట్ల జిల్లాలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా బాపట్లలో సెప్టెంబర్ 25న గ్రామీణ పేదలతో కూలిదండు మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. 300 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బోడ వజ్రం, గోలిమే బాల యేసు, పొట్టేలు పెంటయ్య పాల్గొన్నారు.

## విక్రయాలకు సిద్ధమైన గణేష్ విగ్రహాలు

విక్రయాలకు సిద్ధంగా ఉన్న గణేష్ విగ్రహాలు

**ముదినేపల్లి:** వినాయక చవితి ఉత్సవాల్లో పూజలు అందుకునేందుకు వినాయక విగ్రహాలు ముదినేపల్లి సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసే మండపాల్లో ప్రతిష్టించేందుకు వివిధ అలంకరణలతో, రకరకాల రూపాల్లో గణనాధులను శిల్పులు సిద్ధం చేశారు. అన్ని తరగతుల వారికి అందుబాటులో ఉండే విధంగా వివిధ సైజుల విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. ఈ విగ్రహాలను రూ.1500 నుంచి రూ.7వేల వరకు విగ్రహం బట్టి ధర ఉంటుందని విక్రయదారుడు మండలంలోని పెద్దగున్నూరుకి చెందిన కలిదిండి పెద్దిరాజు తెలిపారు. తాను తయారుచేసిన విగ్రహాలు పర్యావరణానికి ఎటువంటి హానీ చేయవని, పెద్దగా లాభం లేకున్నా వృత్తి ధర్మాన్ని వీడలేక వినాయకుడి విగ్రహాలను తయారు చేస్తున్నానంటున్నారు. ఈ సంవత్సరం 100 విగ్రహాల వరకు వివిధ సైజుల్లో తయారు చేసినట్లు పెద్దిరాజులు తెలిపారు. ఎన్నికలు దగ్గర పడటంతో కైకలూరు నియోజకవర్గంలో పలువురు దాతలు 400 వరకు విగ్రహాలు ఉచితంగా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నందున విగ్రహాలు పెద్దగా అమ్ముడుపోయే పరిస్థితి లేదని తెలిపారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో విగ్రహాలు తయారు చేశానని, అయితే ఈ ఏడాది విగ్రహాలు అమ్ముడుపోయే పరిస్థితి చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చవితి ఉత్సవాలకు మండపాలను ఇప్పటికే నిర్వాహకులు సిద్ధం చేశారు.

## లైంగిక వేధింపులను నిరోధించాలి

**ఏలూరు టౌన్:** బాలల పట్ల లైంగిక వేధింపులు లాంటి సంఘటనలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్, కొవ్వాక స్టాండ్‌లో జై భారత్ ఆటో యూనియన్ కార్మికులకు 'బాలల పరిరక్షణ'పై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమములో శేఖర్ బాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలలకు రక్షణగా ఉందామని పిలుపునిచ్చారు.

# పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

### ఓజోన్ పొర ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన

ఓజోన్‌పొర ప్రాముఖ్యతపై విద్యార్థుల ర్యాలీ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఓజోన్ పొర అత్యంత హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై గల జీవరాశిని కాపాడుతుందని ప్రిన్సిపల్ డా.కెఎ.రామరాజు తెలిపారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సిఆర్ రెడ్డి కళాశాలలో 'ఓజోన్ పొర క్షీణత - కారణాలు, నివారణలు' అనే అంశంపై అవగాహనా కార్యక్రమం రసాయన శాస్త్రం, వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం ఓజోన్ పొర ప్రాముఖ్యతపై సామాజిక అవగాహన కల్పించుటకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వ్యవహరించిన ప్రిన్సిపల్ డా.కెఎ.రామరాజు మాట్లాడుతూ భూ ఉపరితలంపై వాతావరణ పొరలు, వాటిలో ఓజోన్ పొర స్థానం, ఈ పొర ఆవశ్యకత, దాని నిర్మాణం, క్షీణతల గురించి సైద్ధాంతికంగా విద్యార్థులకు వివరించారు. ఓజోన్ పొర అత్యంత హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై గల జీవరాశిని కాపాడుతుందని, కాని మానవ ప్రేరితమైన వాయు కాలుష్యం, క్లోరో ఫ్లోరో కార్బన్ల అధిక వినియోగం వలన, ఈపొర క్షీణిస్తున్నదని దాని వలన అతినీలలోహిత కిరణాల అధిక ప్రభావం సంభవించి మానవులలో చర్మ కాన్సర్లు, కంటి సమస్యలు, జన్యు సమస్యలు తలెత్తడమే కాకుండా జీవ వైవిధ్యం కూడ దెబ్బ తింటుందని తెలిపారు. ఓజోన్ పొర క్షీణతకు కారణమైన క్లోరోఫ్లోరో కార్బన్స్, హేలోన్స్, క్లోరిన్, బ్రోమిన్, మిథైల్ క్లోరైడ్, బ్రోమైడ్ల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఈపొర క్షీణతను తగ్గించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుజి కరస్పాండెంట్ డా.కెఎస్.విష్ణుమోహన్, కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి విఎఎస్.సతీష్, వృక్షశాస్త్ర విభాగాధిపతి టి.నిహారిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలి : వ్యకాస

### నేటి నుంచి 25 వరకూ సంతకాల సేకరణ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

దళితులపై దాడులు అరికట్టాలని, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు, మానభంగాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మణిపూర్‌లో మనువాదులు ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేయడం యావత్ భారతాన్ని తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా మతోన్మాద ప్రధానమంత్రి మోడీ నోరుమెదపక పోవడం దారుణమన్నారు. ఈ ఘటనలను మన రాష్ట్ర పాలకవర్గాలు ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. దళితులను ఆదిపత్య కులాలు పాలక పార్టీలకు ఓటు బ్యాంక్‌గా చూస్తున్నాయి తప్ప వారిని మనుషులుగా చూడడంలేదని విమర్శించారు. బిజెపి కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని, రిజర్వేషన్లను అమలు చేయకుండా అనేక ప్రయత్నాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో కూడా రోజు రోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని, దళితుల హక్కులను పాలక వర్గాలు కాలరాస్తున్నాయన్నారు. దళితులకు భూపంపిణీ చేయడానికి వచ్చిన భూ చట్టాలను, 9/77 అసైన్డ్ చట్టాలను కాలరాసి దళితులకు భూమి లేకుండా చేస్తుందని దుయ్యబెట్టారు. భూస్వాముల పక్షాన ప్రభుత్వం నిలబడుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేపట్టామన్నారు. అందులో భాగంగానే సెప్టెంబర్ 29న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించబోతున్నామన్నారు. ఈ ఆందోళనా పోరాటంలో యావన్మంది దళితులు, ప్రజాతంత్ర వాదులు, కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి ప్రకారం బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించాలని కోరారు. దీనిలో భాగంగా జిల్లాలో దళిత రక్షణ యాత్రలో సామాజిక న్యాయం రక్షణ కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు, సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు ఈనెల 17 నుంచి 25 వరకూ జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, ఎ.రవి, వై.నాగేంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళి రావు, రాజమండ్రి దానియేలు, సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, మాధవ, ప్రభాకరావు, దుర్గ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## 'గురజాడ గొప్ప అభ్యుదయ కవి'

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

గురజాడ అప్పారావు గొప్ప అభ్యుదయ కవి అని, ఆయన తన రచనలు ద్వారా సాంఘిక దురాచారాలను తొలగించటానికి ప్రయత్నం చేశారని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాలు ఇన్‌ఛార్జి ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ కుమార్ శనివారం ప్రారంభించారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు గురజాడ గురించి వ్యాస రచన, వక్తృత్వ, దేశమంటే మట్టికాదోయ్ గేయ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎం.రవి, పివి.కన్నారావు, బి.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు తప్పనిసరి : డిఎస్‌పి

**ప్రజాశక్తి - ఏలూరు**

సహృద్భావ వాతావరణంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా, వేడుకలు నిర్వహించుకోవడానికి అందరూ సహకరించాలని డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు సూచించారు. ఏలూరులో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని, శాంతి పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి వారికి డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో తగు సూచనలు చేశారు. ఈ కమిటీలో మండపాల ప్రతినిధులు, వివిధ మత సంఘాల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట ప్రధాన రోడ్ల మీద, రహదారులను మూసివేస్తూ, వివాదాస్పదం ఉన్న స్థలాలు, ఇతర మత ఆలయాల ప్రాంగణాలలో నిలబెట్టరాదన్నారు. విగ్రహాల నిలుపు ప్రదేశంలో తప్పకుండా పోలీసు వారి నుంచి మైక్ పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ మండపాల ప్రతినిధులు, శనివారం పేట మసీదు కమిటీ సెక్రటరీ సర్దార్ షరీఫ్, షేక్ మహబూబ్ పాషా, రామనపూడి శివ ప్రసాద్, విహెచ్‌పి, సుబ్రహ్మణ్యం, హిందూ ధర్మ రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు హాజరైయ్యారు.

**చింతలపూడి :** వినాయక చవితి పందిళ్లు ఏర్పాట్లు చేసుకునే వారు ఖచ్చితంగా పోలీసులు వారి అనుమతులు తీసుకోవాలని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు తెలిపారు. చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి పందిళ్లను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ ప్రసాద్ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జంగారెడ్డి గూడెం :** మండపాల ప్రతినిధులు ప్రశాంత వాతావరణంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వేడుకలు నిర్వహించడానికి అందరూ సహకరించాలని సిఐ పి.రాజేష్ తెలిపారు. శనివారం చవితి సందర్భంగా ఉత్సవ కమిటీ వారు పాటించాల్సిన జాగ్రత్తలపై స్థానిక సిఐ కార్యాలయంలో అవగాహన కల్పించారు.

**ముదినేపల్లి:** వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లో పందిళ్లు వేస్తే తప్పనిసరిగా పోలీసులు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ డి.వెంకట్ కుమార్ శనివారం తెలిపారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 64 నూతన పింఛన్లు అందజేత

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలోని పాత పట్టిసీమ పంచాయతీలో 64 నూతన పింఛన్లను లబ్ధిదారులకు పాత పట్టిసీమ సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.విజయ కుమారి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు, నూనకాని ధర్మేంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏలూరు రూరల్ తహశీల్దార్‌గా శ్రీనివాస్

**ఏలూరు టౌన్:** ఏలూరు రూరల్ తహశీల్దారుగా జెఎస్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ అమలాపురం తహశీల్దారు కార్యాలయంలో ఎఇగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పటి వరకు ఏలూరు తహశీల్దారుగా ఉన్న సోమసుఖేర్ ఏలూరు టౌన్ తహశీల్దారుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సక్రమంగా నిర్వర్తించడమే తన బాధ్యత అని శ్రీవాసరావు శనివారం ప్రజాశక్తికి తెలిపారు. శనివారం రాత్రి ఆయన ఏలూరు తహశీల్దారు సోమశేఖర్‌ని కలిసి బాధ్యతలు అందుకున్నారు.

## 70 కోళ్ల యూనిట్లు మంజూరు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలానికి 70 పెరటి కోళ్ళ యూనిట్లు మంజూరైనట్లు ఎపిఎం బి.సత్యనారాయణ శనివారం తెలిపారు. క్రాంతి మండల మహిళా సమైక్య నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు పెరటి కోళ్ళ 70 యూనిట్లు మంజూరు కాగా, యూనిట్ ధర రూ.4500 అన్నారు. ఒక యూనిట్‌కు 12 కోళ్ళు, 30 కేజీల మేత, ఒక మెడికల్ కిట్టు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో టిడిపి నిరసన

**ముదినేపల్లి:** చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ముదినేపల్లిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కొడాలి వినోద్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు దీక్షా శిబిరం వద్ద కొవ్వొత్తులతో తమ నిరసన వ్యక్తం చేశారు.

**లింగపాలెం :** రంగాపురం గ్రామంలో లింగపాలెం మండల పార్టీ అధ్యక్షులు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన

### ప్రతిభలో పర్యావరణహిత మట్టి విగ్రహాల పోటీ

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన పొందాలని ప్రతిభ పాఠశాల ప్రిన్సిపల్ సరోజ రెడ్డి తెలిపారు. శనివారం విద్యార్థుల్లో పర్యావరణం గురించి అవగాహన కలిగించడానికి ప్రతిభ పాఠశాల ప్రాంగణంలో పర్యావరణహిత గణేష్ మట్టి విగ్రహాల పోటీ నిర్వహించారు. 300 మందికి పైగా విద్యార్థులు వివిధ పదార్థాలతో ప్రతిమలను తయారు చేసి మట్టి విగ్రహాలను పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు క్షుణ్ణంగా పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పోటీలో పాల్గొన్న విద్యార్థులకు అందజేశారని ఆమె తెలిపారు. వినాయక చవితి నేపథ్యంలో రసాయనాలతో కూడిన విగ్రహాలు తయారు చేయడం వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్న ప్రజల్లో మార్పు రావడం లేదన్నారు. కాలుష్య రహిత మట్టి విగ్రహాలని వినాయకచవితి ఉత్సవాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సింధూషా రెడ్డి, సుభాష్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలి

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి సబ్ డివిజన్ పోలీసులకు సూచనలు ఇచ్చారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలవరం ఏలూరు సబ్ డివిజన్ పోలీసులతో నేర సమీక్ష సమావేశం జిల్లా ఎస్‌పి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారిని ఉద్దేశించి మాట్లాడుతూ వినాయక చవితి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో నేర నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలను ఆమె వారికి సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని ఆమె ఆదేశించారు. తప్పిపోయిన బాల బాలికల కేసులలో వేగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని ఆమె సూచించారు. మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనపై శ్రద్ధ వహించాలని ఆమె తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, బ్లాక్ స్పాట్ల వద్ద పెట్రోలింగ్ పెంచాలని ఆమె తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గించేందుకు ఖచ్చితంగా హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. నగరాల్లో, పట్టణాల్లో రౌడీ షీటర్లపై నిఘా పెంచి వారి కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కూడా ఆమె వారికి సూచించారు. శాఖలో పనిచేసే సిబ్బంది అధికారులు అవినీతికి దూరంగా ఉండాలని, లేని పక్షంలో అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# ఉమ్మడి జిల్లా న్యాయమూర్తుల వర్క్‌షాప్

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు శనివారం ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్క్ షాప్ నిర్వహించారు. శనివారం ఉదయం 9:30 గంటలకు జిల్లా గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయనకు పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఘన స్వాగతం పలికారు. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్బినేని విజయకుమార్, ఇతర న్యాయమూర్తులు, జిల్లా అధికారులు కూడా న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో కేసుల విచారణ, కోర్టుల పనితీరుపై విశ్లేషించారు. అనంతరం జిల్లా కోర్టు, అదనపు జిల్లా కోర్టులను తనిఖీ చేశారు.

**జస్టిస్ రఘునందనరావును కలిసిన ప్రముఖులు**

జిల్లా అతిథి గృహములో రఘునందన రావును జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె. ఖాజవలి, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

# స్కిల్‌హబ్ ద్వారా అనేక మందికి ఉపాధి : ఎంఎల్‌ఎ

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

బుట్టాయగూడెంలో స్కిల్‌హబ్ ఏర్పాటు చేయడం ద్వారా అనేకమంది శిక్షణ, ఉపాధి పొందడం చాల సంతోషదాయకమని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో మరిన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, తద్వారా అనేక మందికి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్ సొల్యూషన్ మొదటి బ్యాచ్ కోర్సుకు గాను శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ధ్రువపత్రం, ఉద్యోగ నియామక పత్రాలను ఎంఎల్‌ఎ బాలరాజు అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న విద్యార్థులు తద్వారా పలు కంపెనీల్లో ఉపాధి పొందాలని, అలాగే మరిన్ని పదోన్నతులు పొందాలని ఆమె ఆకాక్షించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ తరువాత మంచి ఉపాధి అవకాశం వచ్చినప్పుడు దూరప్రాంతాలకు వెళ్లడానికి కూడా ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.హనుమాన్, ఎంపిడిఒ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచి వెంకాయమ్మ, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణరెడ్డి, స్కిల్ హబ్ ట్రైనర్ రాధ, కోఆర్డినేటర్ దుర్గ, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### బద్రినాథ్ యాత్రలో కామవరపుకోట వాసి మృతి

**ప్రజాశక్తి - కామవరపుకోట**

మండలంలోని జీలకర్రగూడెం గ్రామానికి చెందిన మరీదు సత్యవతి సెప్టెంబర్ 4వ తేదీన రాజమండ్రి నుంచి వెళ్తున్న యాత్ర బస్సులో బద్రీనాథ్ యాత్రకు వెళ్లారు. కేదర్‌నాథ్, చారుదాం యాత్ర ముగించుకుని బద్రీనాథ్‌కి వెళ్తున్న సమయంలో గురువారం సాయంత్రం బిపి తగ్గటంతో సమీప ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించారు. శనివారం ఉదయం సత్యవతి మృతి చెందడంతో కుటుంబ సభ్యులలోను, జీలకర్రగూడెంలోను విషాదఛాయలు అలుముకున్నాయి. సత్యవతితో పాటు తన సోదరి మల్లేశ్వరి కూడా ఈ యాత్రలో ఉన్నారు. సత్యవతి మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారు. అక్కడి నుంచి అంబులెన్స్ మాట్లాడి సత్యవతి మృతదేహాన్ని జీలకర్రగూడెం తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**రూ.లక్ష ఆర్థిక నష్టం**

**ప్రజాశక్తి - ముసునూరు**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం గడ్డం తిరుపతిరావుకు చెందిన పూరిల్లు శనివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.లక్ష ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దీంతో అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రవీంద్ర స్పందించి కుటుంబ సభ్యులకు బట్టలు, రూ.10వేలు నగదు, వంట సామాగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ఎస్-ఎస్ఎల్ అధ్యక్షులు ఎల్.కాంతారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాశక్తి - భీమడోలు**

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. 216 జాతీయ రహదారిపై తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు మోటార్ వాహనంపై వెళుతున్న మహిళను అదే మార్గంలో పయనిస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళకు స్థానికులు సపర్యలు చేసి అంబులెన్సులో చికిత్స కోసం ఏలూరు తరలించారు.

**మహిళకు గాయాలు**

216ఎ జాతీయ రహదారిపై సూరప్పగూడెం గ్రామం వద్ద హైవే సర్వీస్ రోడ్డులో నడిచి వెళుతున్న బొడిగట్ల చంటి(58) అనే మహిళ అదే మార్గంలో వెళుతున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొని అగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో బొడిగట్ల చంటి ఘటనాస్థలిలోనే చనిపోయారు.

### చెరువులో వ్యక్తి గల్లంతు

**ప్రజాశక్తి - చింతలపూడి**

చెరువులో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. చింతలపూడి ఫైర్ స్టేషన్ ఎస్ఐ గంటా వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవపురం గ్రామానికి చెందిన రాముల రాంబాబు డిఎన్ రావు పేట వద్ద ఉన్న వెంకటాద్రి చేరువులో పడి గల్లంతైనట్టు, స్థానికుల సహాయంతో ఆ వ్యక్తి గురించి గాలించినట్లు తెలిపారు. సమయం మించిపోవటంతో ఆదివారం ఉదయం మరలా గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం

**ప్రజాశక్తి - ముసునూరు**

వ్యక్తి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన పల్లి పాము రవీంద్ర కుమార్ ఐటిఐ చదివి, క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 12వ తేదీన విజయవాడ వెళ్లి మరలా ఇంటికి తిరిగి రాకపోవడంతో గమనించిన కుటుంబసభ్యులు అన్నిచోట్లా వెతికి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. తమ అక్క మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచి

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా శానిటేషన్ చేయిస్తున్నామని నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద, కార్యదర్శి జె.నాగేశ్వరరావులు వెల్లడించారు. వైఎస్ఆర్ కాలనీ ఐదో రోడ్డులో పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించే పనులు శనివారం నిర్వహించారు. సర్పంచి పనులను పర్యవేక్షించారు.

## ద్వారకాతిరుమలలో అన్నమాచార్య సంకీర్తన

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

హిందూ ధర్మాన్ని రక్షించాలంటే ప్రతి మనిషి భక్తి భావంతో మెలగాలని అందుకు శ్రీఅన్నమాచార్య సంకీర్తన, భక్తి గీతాలు దోహదపడతాయని శ్రీఅన్నమాచార్య సంకీర్తన స్వరవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్, ప్రముఖ గాయకులు కోటపాటి వేంకటేశ్వర్లు తెలిపారు. ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు క్యూలైన్ కళావేదికపై శ్రీఅన్నమాచార్య సంకీర్తన స్వర వాహిని చారిటబుల్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే అన్నమాచార్య సంకీర్తనలతో అష్టోత్తర శత సభాగాన సంకీర్తన మహా యజ్ఞంలో భాగంగా అన్నమయ్య సంకీర్తన చెయ్యాలి అనే తలంపుతో పవిత్ర పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో 'సంకీర్తన సేవ గాన కచేరీ' కార్యక్రమాన్ని ప్రముఖ గాయకులు కోటపాటి వేంకటేశ్వర్లు, వారి శిష్య బృందం భక్తి సంగీత పాటలతో గాన కచేరి నిర్వహించారు. ఆలయ జాయింట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వెండ్ర త్రినాధరావు ఆదేశాల మేరకు దేవాలయ ఎఇఒ మెట్టుపల్లి దుర్గారావు, సూపరిటెండెంట్ రమణ రాజు, వెంకటేశ్వర్లను సన్మానించారు.

## పారిజాతగిరిలో అన్నదానం

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మాణిక్యాల రాంబాబు తెలిపారు. శనివారం పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు కాలినడకన ఆలయాన్ని సందర్శించారని తెలిపారు. ఈ క్రమంలో అన్నదాతలు ముప్పన నరేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డిరంగప్రసాద్, రాజనపండు, వాసవిశాయి నగేష్, మాజీ ఛైర్మన్ ఉప్పల గంగాధర్ పాల్గొన్నారు.

## వరుసగా నాలుగో ఏడాది కాపు నేస్తం

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

కాపు వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏలూరు నియోజకవర్గం వ్యాప్తంగా 45 నుంచి 60 ఏళ్ల మధ్య గల 1,612 మంది కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల మహిళలకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.2 కోట్ల 41 లక్షల 80వేలు లబ్ధి చేకూరిందని అన్నారు. ఏలూరు నియోజకవర్గ వ్యాప్తంగా గత నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.60వేలు చొప్పున సుమారు రూ.9 కోట్లకుపైగా నిధులను కాపు అక్కాచెల్లెమ్మలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో కాపు వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చామని, వారి అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నామని అన్నారు. నవరత్నాల పథకాలతో వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, భీమడోలు, ఏలూరు జిల్లా
I.A.No. 211/2021
in F.D.I.A.No. 552/2023
in O.S.No. 91/2021
Between:
Sri Bhimadole Bala Srinu ...Plaintiff
AND
Sri Pandella Krishna Bhagavan ...Defendant /Respondent-1
Respondent /Defendant-1:
Sri Pandella Krishna Bhagavan, S/o. Satyanarayana, Hindu, Male, Aged 49 Yrs, R/o. D.No. 16-77, Ganapathi Center, Bhimadole Village, Eluru Dist.
పై నెంబరు దావా I.A.No. 211/2021 in F.D.I.A.No. 552/2023 in O.S.No. 91/2021 గ్రంధములో డిఫెండెంటు /రిస్పాండెంటు 1 కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు (సబ్ స్టీ ట్యూట్ సర్వీస్) పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు అమలుకు ది.30-06-2023వ తేదీన ఆర్డరు వేసినారు. ది.20-09-2023వ తేదీన వాయిదా. మీరు పై వాయిదా తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో స్వయం గా గాని, అడ్వకేట్ ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను. లేని ఎడల మీ పై పరోక్షమున తీర్మానించబడును.
K.M.SRINIVASA RAO (VASU)
Advocate, Bhimadole.
Cell: 99121 81862